# 37. చేరమాన్ పెరుమాళ్ నాయనారు

ఇప్పటి కేరళ రాష్ట్రమయిన మలైనాడులో చేరమాన్ పెరుమాళ్నాయనారు కోడు న్కోలూరులో (మలైనాడు రాజధాని. మహోదయం అనిపేరు గూడ వుంది) - ఉత్తియన్ కుటుంబము కొత్తయార్ల రాజ వంశములో జన్మించాడు. చేర వంశస్తులందరికి చేరమా ను అనునది సాధారణ నామము. పట్టాభిషిక్తుడైన తర్వాత పెరుమాళ్ అని పిలిచేవారు. అసలు పేరు - పెరుమ్ - ము - కొత్తయారు. మంచి సంస్కార వంతుడు. బాల్యము నుంచి దైవభక్తి తత్వరతతో నుండెడివాడు. వయస్సు పెరిగిన (వచ్చిన) కొలది దైవభక్తి గూడ పెరుగుతూ వచ్చింది. విచక్షత, నిష్పక్షపాతము ఆయనలో మూర్తీభవించాయి. పరి పాలకుడుగా నుండాలన్న ఇచ్ఛ ఆయనకు లేనేలేదు. అందుకని వయస్సురాగానే సన్యసిం చి తిరువంజక్కళముకు చేరి అచ్చట శివపూజాదురంధరుడై యుండెను. దేశాన్ని సెన్ గోల్ పోరయాను (చెంగప్పరుడు) పరిపాలించేవాడు. ఆయన గూడ నిత్యానిత్య వివేక ము నెఱిగి మోక్షమునకై ప్రపంచ సంబంధాల నుండి వైదొలగి వెళ్లిపోయాడు. ఆయ నకు సంతతి లేదు. సింహాసనం ఖాళీగా వుంది. అందుకని ప్రజలు తిరువంజక్కళము నకు వెళ్లి పెరుమ్ - మ - కొత్తయారును సింహాసనమధిష్ఠించి రాజ్యాన్ని కాపాడమని అర్థించాడు. తన దైవ ఉపాసనకు అడ్డంకియని ముందర రాజ్యమధిష్ఠించుటకు అంగీక రించలేదు. కాని దైవాజ్ఞ - అతను పరిపాలకుడవాలని. దేవళమునకు వెళ్లి దేవుని ప్రార్థిం చాడు. పరమాత్మ అతనిని రాజువు కమ్మని ఆదేశించాడు. నీవు రాజువయితే ప్రజలు నిన్ను అనుసరిస్తారు. రాజువై నీవు శైవాగమమును వ్యాపింపజేయవచ్చును. అందుకని రాజువుకా అని పరమాత్మ ఆదేశించాడు. దైవాజ్ఞ మూలాన్ని సింహాసన మధిష్ఠించి న్యాయవంతముగా బుద్ధికుశలతతో పరిపాలన చేశాడు. ఆయనకు అన్ని భాషలు, చివ రకు పక్షుల భాష గూడ తెలుసును. దేవుడు అష్టైశ్వర్యాలు, బలం, రాజవాహనాలు అన్ని ఆయనకు ప్రసాదించాడు.

పట్టాభిషిక్తుడైన పిదప దేవాలయమునకు వెళ్లి అర్చించి తిరిగి వస్తుంటే ఒక చాకలివాడు దేహమంతా విభూతితో కనిపించాడు. ఆ దృశ్యము చేరమానుకు సాక్షాత్తు పరమ శివుని చూస్తున్నట్లు అన్పించింది. అందుకని ఏనుగు దిగి చాకలిని అతను వారి స్తున్నా వినకుండ మ్రొక్కాడు. చేరమాను యొక్క అనితర భక్తి అందరకు గోచరమైంది.

చేరమాను పవిత్ర జీవనము, భక్తి ప్రపత్తులు పరమ శివుని ముగ్ధుణ్ణి చేశాయి. పెరుమాళ్ళు అనేక శివాలయములను దర్శించి పరమ శివుని సేవించి స్వస్థలముకు చేరుకున్నాడు. మధుర సోమసుందరేశ్వరుడు తన భక్తుడైన బాణాపతిరారు (బారాభ ద్రుడు) నకు సకలైశ్వర్యములు ఒసగదలచితిని. చేరమాను పెరుమాళ్ పేరున ఒక చీటీ నిచ్చెదను. దానిని తీసికొనిపోయి అతనికిమ్ము. అతను సకలము నెరవేర్చును ' అని చెప్పి చీటిఇచ్చెను. ఆ చీటి (తాళపత్రము)లో దైవము సోమసుందరారు రచించిన గీతము న్నది. దాని అర్థము ఇలా వుంది. 'కవులను పండితులను సమాదరించే, ప్రజలను న్యాయ వంతముగా పరిపాలించే ఓ మహారాజా! నీకు జయము, జయము నీ భక్తి తత్పరత, దయార్ద్ర హృదయత, దాతృత్వము నన్ను ఆకట్టుకున్నాయి. ఈ తాళపత్రము గొని తెచ్చునా తని పేరు బాణపతిరారు. గొప్ప సంగీత విద్వాంసుడు. నీరీతి పరమ దైవభక్తి తత్పరుడు. నన్ను గూర్చి అతనికి ఇష్టమైన 'యాజు' (వీణ) మీద నన్ను కీర్తిస్తూ పాడుతూ వుంటాడు. నిన్ను చూడాలని అభిలషిస్తున్నాడు. అతనిని సాదరంగా గౌరవపురస్సరంగా ఆహ్వానించి అనంత పురస్కారములనిచ్చి గౌరవించవలసినది" అని వుంది.

చేరమాను ఆ విద్వాంసుని ప్రేమతో, గౌరవంతో ఆహ్వానించాడు. "సోమసుందరే శ్వరస్వామికి నేటికి నా మీద అనుగ్రహము కలిగినదా" యనికొని యాడుచు చీటి (తాళపత్రము) సంగతి మంత్రులకు తెలియజేసి "కోశమున సకలమును బాణాపతిరారు ఇంటికి తరలించుడు" అని ఆజ్ఞాపించి బాణాపతిరారు దెసతిరిగి"స్వామీ ఈ రాజ్యమును గూడ స్వీకరించి మీసేవ చేయ నంగీకరింపవలయు"నని ప్రార్థించాడు. అందులకు బాణాపతిరారు నిర్ఘాంతపోయాడు.

రాజుగారి పరమ భక్తితత్పరత అర్థమైంది. "ఓ రాజా! మీ దర్శనంతో నా జీవితము ధన్యమైంది. నాకు వలసినంత మాత్రమే మీ దగ్గర నుంచి తీసికొనగలను. అది దేవుని ఆజ్ఞ గూడ " అని చెప్పి తనకు వలసినది తీసికొని రాజుకు వందన మాచరించి తిరిగి వెళ్ళాడు. చేరమాను ఆయనను ఏనుగు మీద ఎక్కించి పంపాడు. తన రాజ్యము పొలి మేర దాక ఆయనతో వెళ్లి ఆయనను సాగ నంపాడు.

చేరమానుకు నటరాజస్వామి యెడ బహు ప్రీతివుంది. తన శరీరము, మనస్సు, ఆత్మను గూడ ఆయనకే అర్పణ మొసగాడు. ప్రతిరోజు ఆయనను అర్చించేవాడు. ఆయన అర్చించే సమయములో నటరాజస్వామి (కనకసభాపతి) మూపుర ధ్వనులు (కాలిఅం దెల) స్వామి నృత్యము చేస్తున్నట్లు వినిపించేది. ఒక రోజున అర్చన సమయంలో కాలి అందెల ధ్వని వినపడలేదు. చేరమాను తాను మహాపరాధము చేసితినని భావించి తన ఖడ్గముతో మరణమునకు ఉద్యుక్తుడయ్యాడు. వెంటనే మూపురధ్వని వినపడింది. ఆకా శము నుండి ఒక వాణి వినిపించింది. ' నా మిత్రుడు నంబిఅరూరారు తిల్లై వచ్చాడు. ఆయన మధురమైన పాటలను వింటూ తన్మయుడనైనాను. అందుకని నా మూపురధ్వ నులలో నిన్ను ఆశీర్వదించుటకు ఆలస్యమైంది." పరమ శివుడు - సుందరారు, చేరమా ను ఇరువురు మిత్రులవాలని వాంఛించాడు. అందుకని సుందరార్ గూర్చి గొప్పగా చెప్పా డు. చేరమాను నటరాజును అర్చించుటకును సుందరారును దర్శించుటకును తిల్లైకు వెంటనే బయలుదేరాడు. చేరమాను తిల్లైచేరే సరికే సుందరారు ఆ స్థలము వదిలి వెళ్లి పోయాడు. అందుకని చేరమాను తిరువారూరు వెళ్లి అచ్చట సుందరారును కలిసికొన్నా డు. ఒకరినొకరు సాష్టాంగ ప్రణామములు చేసికొన్నారు. ఒకరినొకరు భక్తితో పరిష్వంగ నం చేసికొన్నారు. తిరువావూరులో చేరమాను విఖ్యాతినందిన "తిరుమమ్మనికోవై" కృతి ని దేవదేవుడైన త్యాగరాజు మీద రచించి పాడాడు.

ఇద్దరు కలిసి వేదారణ్యం వెళ్లారు. అక్కడ చేరమాను 'తిరుఅంతాది' కృతిని దేవుని మీద పాడాడు. చాల దేవళములను సందర్శిస్తూ ఇద్దరు మధుర చేరుకొన్నారు. పాండ్యరాజు సాదరముగా వాళ్లని ఆహ్వానించాడు.

ఆ సమయంలో అక్కడ యున్న చోళ యువరాజుగూడ గౌరవించాడు. వాళ్లతో కలిసి చాలా దేవాలయములను ఇద్దరూ సందర్శించారు. వారి దగ్గర నుండి సెలవు తీసికొని చేరమాను, సుందరారు తిరువారూరునకు చేరారు. చేరమాను కోరికపై సుందరారు కొడున్‌కోలూరు దనుక చేరమాను వెంట వెళ్లాడు. అచ్చట చేరమాను సుందరారును ఏనుగుపై వూరేగించి సత్కరించాడు. సుందరారు తిరిగి వెళ్తూ చేరమానును - రాజ్యమును న్యాయవంతముగ నేర్పుతో పరిపాలించ వలసినదిగా చెప్పాడు. భక్తుని కోరికను చేరమాను తూచాతప్పక పాటించసాగాడు.

మరి ఒకసారి చేరమానుతో సుందరారు కొడున్‌కోలూరులో వున్నప్పుడు - సుందరారు వంటరిగా తిరు అంచైకాలము కోవెలను సందర్శించాడు. అచ్చట తనను సంసార ఇహలోక బాధ్యతలనుండి తప్పించి కైలాసమునకు తీసికొనిపొమ్మని శివుని అర్థించాడు. మహాదేవుడు అతని అభ్యర్థనను మన్నించి తెల్ల ఏనుగుపై కైలాసానికి సుందరారును తెచ్చుటకు ప్రమధగణాన్ని పంపాడు. చేరమానుకు సుందరారు కైలాసానికి చేరుతున్నట్లు తట్టింది. తాను గూడ తన భద్రాశ్వమును అధిరోహించి దాని చెవిలో పంచాక్షరి మంత్రమునుచ్ఛరింపగా అది చేరమానును సుందరారు వద్దకు తృటిలో చేర్చింది. సుందరారును కలిసికొన్నాడు. ఇద్దరు కలిసి కైలాసంకు చేరుకొన్నారు.

కైలాసంలో ద్వారపాలకులు ఒక్క సుందరారునే లోనికి ఆహ్వానించారు. సుందరారు దేవుని దగ్గరకు వెళ్లి నుతించాడు. నుతించి, చేరమాను గేటు బయటయున్నాడని చెప్పాడు. తన స్నేహితుని మురిపించుటకు పరమశివుడు తన వాహనమైన నందికేశ్వరుని పిలిచి చేరమానును తీసికొనిరమ్మని పంపాడు. శివుడు చేరమానును తన అనుమతిలేనిదే కైలాసానికి ఎలా రాగలిగావు' అని ప్రశ్నించాడు. "సుందరారు కైలాసమునకు

బయలుదేరుట చూచాను. అతని వియోగము భరించలేక అతనితో వచ్చాను" అని చేరమాను బదులు చెప్పాడు. శివుడు చేరమానును వాత్సల్యంతో కైలాసానికి ఆహ్వానించాడు.

ఈ సంఘటనలో చేరమాను ఒక మహాసత్యాన్ని వెల్లడించాడు. ఒకడు అనర్హుడైనను గురువు (ఋషికి)కు ఆత్మీయుడవగలిగినచో గురువు తనతోబాటు తన శిష్యునికి గూడ భగవత్ సాన్నిధ్యము ఇప్పించ గలడన్న సత్యము ప్రస్ఫుటమైంది.

పరమశివుడు చేరమానును తన ప్రధమ గణాధిపతిగా చేసికొన్నాడు.

****